సాక్షి
ఏలూరు
బుధవారం । 27 । నవంబర్ । 2024



ప్రభుత్వం మాది.. పెత్తనం మాది

ద్వారకాతిరుమల మండలం సత్తాల గ్రామం లోని పెద్ద చెరువులో ఒక టీడీపీ నేత రాత్రి, పగలు అనే తేడా లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని తరలించేస్తున్నాడు. 8లో ▸



ప్రకృతి వ్యవసాయమే రక్ష

ప్రకృతి వ్యవసాయమే పర్యావరణానికి రక్ష అని ఉద్యాన, మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. ఉద్యాన వర్సిటీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. 8లో ▸



గంజాయి వయా కుక్కునూరు

గంజాయి స్మగర్లకు కుక్కునూరు రహదారి రాజమార్గంగా తయారైంది. చింతూరు, ఒడిశా, చత్తీస్‌గఢ్ నుంచి కుక్కునూరు మీదుగా ఖమ్మం తరలిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుదాం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లో మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాజ్యాంగ దినోత్సవం ప్రాధాన్యతను వివరించి అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. తొలుత బీ ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి దిక్సూచిగా బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం నిలుస్తుందన్నారు. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులతోపాటు విధులు, బాధ్యతలు కూడా ప్రజలు గుర్తెరిగి రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ ఆర్.విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జేడీ వి.జయప్రకాష్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్.పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న శానిటేషన్ వర్కర్స్

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్స్‌కు రావాల్సిన ఐదు నెలల బకాయిలు రూ.7.50 కోట్లు వెంటనే ఇవ్వాలని కోరుతూ స్కూల్ స్వీపర్లు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే శానిటేషన్ వర్కర్స్ 1900 మందికి బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరుతూ ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాలకు చెందిన వర్కర్స్ ధర్నాలో పాల్గొన్నారు. పస్తులతో పనులు చేయించడం సిగ్గుచేటని, స్కూల్ స్వీపర్ల ఆకలి మంటలు చల్లార్చాలని పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం కలెక్టర్ కె.వెట్రిసెల్వికి సమస్యలతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.దుర్గ అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి. సోమయ్య మాట్లాడుతూ ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా చోద్యం చూస్తున్నారు తప్ప, సమస్య పరిష్కారం చేయడం లేదని విమర్శించారు. నెలాఖరులోపు జీతాలు చెల్లించకపోతే డిసెంబరు ఒకటో తేదీ నుండి పనులు నిలుపుదల చేసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఏలూరు(మెట్రో): లోకాయుక్త, కోర్టుల ద్వారా, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ద్వారా అందిన కేసుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం లోకాయుక్త, ఎస్సీ, ఎస్టీ కమిషన్ కేసుల పరిష్కారం, రీసర్వేపై అభ్యంతరాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారం, తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోకాయుక్త, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ద్వారా అందిన కేసుల పరిష్కారంపై ప్రతి వారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులతో సమీక్షించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఇరిగేషన్ కాలువలు, డ్రైనేజీలు, పంచాయతీ, ఆర్అండ్‌బీ రోడ్లు, ఆక్రమణలపై సవివరమైన నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

రెవెన్యూ అర్జీలు జాగ్రత్తగా పరిష్కరించాలి

ఏలూరు(మెట్రో): ప్రజల నుంచి వస్తున్న అర్జీలను నాణ్యతతో పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. మంగళవారం సచివాలయం నుంచి పీజీఆర్ఎస్(రెవెన్యూ), ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్ వెరిఫికేషన్, వాటర్ ట్యాక్స్ మ్యాడ్యూల్స్‌పై జిల్లాల కలెక్టర్లతో భూ పరిపాలన ప్రధాన కమిషనరు జి.జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం, ఇళ్ల స్థలాలు, మ్యూటేషన్స్ తదితర అర్జీల పరిష్కార తీరును వివరించారు. అర్జీలు అందిన వెంటనే వాటిని పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కార చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

హామీల అమలు ఎప్పుడు?

- ఆందోళనలతో దద్దరిల్లుతున్న కలెక్టరేట్లు
- రోడ్డెక్కిన చిరుద్యోగులు
- ఆందోళన బాటలో ఆశ, 108, హమాలీ, అంగన్‌వాడీ, వీఓఏలు



ఏలూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేస్తున్న ప్రభుత్వ స్కీం వర్కర్లు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు కాకుండానే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా చిరుద్యోగులు, కూలీలు నిరసనలతో హోరెత్తిస్తున్నారు. నిత్యం వివిధ వర్గాలు, చిరుద్యోగులు కలెక్టరేట్ల నిరసన గళం వినిపిస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ ఆశ వర్కర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు, 108 సిబ్బంది, వీవోఏలు, మెప్మా ఆర్పీలు, వివిధ స్కీం వర్కర్లు పోరు బాట పట్టారు.

నట్టేట ముంచారు: వలంటీర్లు

ఎన్నికల ముందు ఉత్తుత్తి హామీలు ఇచ్చి నట్టేట ముంచారంటూ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకునే పరిస్థితి లేదంటూ చెప్పడమే కాకుండా దీనికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమంటూ తప్పించుకునే వాదనను తెరమీదకు తీసుకువచ్చారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ గ్రామ,వార్డు సచివాలయ వలంటీర్లు ఆందోళన బాటపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, హామీ ఇచ్చిన విధంగా రూ.10 వేల జీతం ఇవ్వాలంటూ కోరుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గ్రామ సచివాలయాలు 938, వార్డు సచివాలయాలు 227 ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 20,482 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు.

తొలగించిన వీఓఏ, ఆర్పీల్ని విధుల్లోకి తీసుకోవాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీఓఏలు, ఆర్పీల పట్ల రాజకీయ వేధింపులు ఎక్కువైపోయాయి. తమకు నచ్చిన వారిని పెట్టుకుంటాం రాజీనామా చేయండి అంటూ స్థానిక కూటమి నేతలు హుకుం జారీ చేస్తున్నారు. అక్రమంగా విధుల్లోంచి తొలగించిన వీఓఏలు, ఆర్పీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ వెలుగు వీవోఏ(యానిమేటర్స్) ఉద్యోగులు ఇటీవల కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహించారు. ఏలూరు జిల్లాలో 100 మంది వరకు వీఓఏలు, 20 మంది ఆర్పీలు విధులకు దూరమయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 50 మందికి పైగా వీఓఏలు, 10 మంది వరకు ఆర్పీలు విధులకు దూరమయ్యారు.

రోడ్డెక్కిన హమాలీలు

పౌరసరఫరాల శాఖ పరిధిలోని గోడౌన్స్‌లో పనిచేస్తున్న హమాలీలు తమ వేతనాలు పెంచాలని కోరుతూ రోడ్డెక్కారు. వీరికి ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతన ఒప్పందాలు జరుగుతాయి. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వేతనాల పెంపును పట్టించుకోలేదు. ఏలూరు జిల్లా పరిధిలోని ఏలూరు, కైకలూరు, పాతూరు, నూజివీడు, ధర్మాజీగూడెం, కుకునూరు, కేఆర్ పురం, జంగారెడ్డిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని స్టాక్ పాయింట్ల వద్ద హమాలీలు ఇటీవల నిరసన వ్యక్తం చేశారు.

హామీలు నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వివిధ వర్గాల ఉద్యోగులకు ఇచ్చిన హామీలు తక్షణం నిలుపుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే వలంటీర్లు, అంగన్‌వాడీ మినీ వర్కర్లు, ఆశలు, స్కీం వర్కర్లు వంటి చిరు ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

– డీఎన్‌వీడీ ప్రసాద్, సీఐటీయూ, జిల్లా కార్యదర్శి, ఏలూరు

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి



చిరు ఉద్యోగులతో పాటు రైతులు, శ్రామికులు, కర్షకులను ఇబ్బందులకు గురిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం బాధాకరం. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, ట్రూ అప్ చార్జీల పేరిట రూ.వేల కోట్ల భారం మోపే విధానానికి స్వస్తి పలకాలి. వీఓఏలు, ఆర్పీలు, వివిధ ప్రభుత్వ స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఐటీయూసీ,

108 ఉద్యోగుల సమ్మె బాట



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న 108 ఉద్యోగులు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 108 ఉద్యోగులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పట్టారు. 108 అంబులెన్స్ సర్వీసులు నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, షిఫ్టుల సిస్టం అమలు చేయాలని, రెండు నెలల వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో 108 వాహనాలు 28 ఉండగా వీటిలో మొత్తం 140 మంది పైలట్‌లు, ఈఎంటీలు పనిచేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 108 వాహనాలు 23 ఉండగా వీటి పరిధిలో 110 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.

మినీ అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్ చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ మినీ వర్కర్లు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 276 మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ తక్షణం జీవోలు ఇవ్వాలంటూ మినీ అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన చేస్తున్నారు. కేవలం రూ.7 వేలు వేతనం ఇస్తున్నారని ఇది అత్యంత దుర్మార్గమంటూ వారు విమర్శిస్తున్నారు. మెయిన్ సెంటర్‌లో పనిచేస్తే కార్యకర్తకు ఇస్తున్న విధంగా తమకూ వేతనం ఇవ్వాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో 206, పశ్చిమగోదావరి జిల్లాలో 70 మంది కలిపి రెండు జిల్లాల్లో మొత్తం 276 మంది మినీ అంగన్‌వాడీ వర్కర్లు పనిచేస్తున్నారు.

ఒప్పందాలు అమలు చేయాలి



ఏలూరులో ధర్నా చేస్తున్న ఆశలు

2024 ఫిబ్రవరిలో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలంటూ ఆశ వర్కర్లు ఆందోళన చేశారు. ఆశ వర్కర్ల వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, గ్రూప్ బీమా ఆరు లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.60 వేలు ఇస్తామంటూ ఒప్పందం చేసుకున్నారని దీనికి సంబంధించి తక్షణం జీవోలు విడుదల చేయాలంటూ వీరు ధర్నా నిర్వహిస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో మొత్తం 3,800 మంది వరకు ఆశలు పనిచేస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ ఇప్పటికే ఏలూరు, భీమవరం కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించారు .

కూటమి ప్రభుత్వంలో రాజ్యాంగం ఖూనీ



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఆటవిక పాలన సాగిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెరిగిపోయాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి, చిరు ఉద్యోగుల సమస్యలు కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిందన్నారు. ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్లపల్లి జయప్రకాష్(జేపీ) మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడంతో పాటు గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా పని చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

10 లోపు రేషన్ సరఫరా

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ప్రజా పంపిణీకి సంబంధించి ప్రతి నెలా 10 లోపు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని ఎండీయు ఆపరేటర్లను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. పీడీఎస్ బియ్యంతో పాటుగా తప్పనిసరిగా కందిపప్పు, పంచదార పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లాలోని పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, చౌకధరల దుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలు, ఎల్‌పీజీ గ్యాస్ డీలర్లు, సేల్స్ ఆఫీసర్లు, జిల్లా పౌరసరఫరాల కార్యాలయ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ చౌక ధరల దుకాణాల డీలర్లు, పీడీఎస్‌కు సంబంధించి నిత్యావసర వస్తువుల విషయమై డీడీలు సకాలంలో కట్టాలని ఆదేశించారు.

కదం తొక్కిన రైతులు, కార్మికులు



మహాధర్నా సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): మోదీ ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా- కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపులో భాగంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు ఏలూరు కలెక్టరేట్ ముందు కదం తొక్కారు. ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. డప్పులు మోగిస్తూ నృత్యాలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ ముందు మహా ధర్నా చేపట్టారు. 75 వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. సభకు సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పి.సోమశేఖర్ అధ్యక్షత వహించారు. సభలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్, ఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకులు ఎస్.రామ్మోహన్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కె.బాషా, అఖిల భారత ప్రగతిశీల రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.గౌస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు పోరండ్ల శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తదితరులు కేంద్ర ప్రభుత్వ విధానాల్ని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర లేకపోవడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు మాఫీ చేస్తూ ఆత్మహత్యలు చేసుకుంటున్న అన్నదాతలకు పైసా కూడా మాఫీ చేయలేదని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ధర్మల సురేష్, సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు రైతులు కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ఏలూరు(మెట్రో): ఎన్నికల సక్రమ నిర్వహణకు శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు చెప్పారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ విధానంలో జరుగుతాయన్నారు. సిబ్బందికి ఏమైనా సందేహాలుంటే వెంటనే శిక్షకుల దృష్టికి తీసుకువస్తే వెంటనే నివృత్తి చేస్తారన్నారు.





అంధుల పరుగు పోటీల్లో పరుగులు తీస్తూ

● ఆత్మస్థైర్యం మెండుగా..

సంకల్పంతో కూడిన ఆత్మస్థైర్యం ఉంటే చాలు ఏ వైకల్యం మనకు అడ్డురాదని నిరూపించారు విభిన్న ప్రతిభావంతులు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున దివ్యాంగులు హాజరై తమ ప్రతిభను చూపారు. ట్రై సైకిల్, జావెలిన్ త్రో, షార్ట్‌పుట్, పరుగు పందెంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలవాలనే కాంక్షతో పరుగులు పెట్టారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు, ఏలూరు(టూటౌన్)



గెలవాలనే కసితో..



జావెలిన్ త్రో

క్లుప్తంగా

చెక్కు బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

దెందులూరు: చెక్కు బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి భీమడోలు కోర్టు ఆరునెలల జైలు శిక్ష విధించింది. వివరాల ప్రకారం.. గోటి మోహనరావు కొవ్వలి గ్రామంలో 13 ఎకరాల వక్ఫ్‌భూమి లీజుకు తీసుకున్నాడు. కౌలు సొమ్ముల నిమిత్తం ముస్లిం వంశపారపర్య ధర్మకర్త ముతావల్లి అబ్దుల్ రహీంకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును ముతావల్లి బ్యాంకులో వేయగా ఖాతాలో డబ్బులు లేకపోవడంతో చెక్కు బౌన్స్ అయ్యింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి చెల్లని చెక్కు ఇచ్చిన మోహనరావుపై కోర్టులో ఫిర్యాదు చేశారు. కేసు విచారణ అనంతరం నిందితుడు మోహనరావుకు మంగళవారం భీమడోలు కోర్టు న్యాయమూర్తి ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. ముస్లిం దేవాదాయ శాఖకు లీజు నిమిత్తం ఇవ్వాల్సిన రూ.2 లక్షల 95 వేలు చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినట్లు ముతావల్లి అబ్దుల్ రహీం తెలిపారు.

చెక్కు బౌన్స్ కేసులో జైలుశిక్ష, జరిమానా

నూజివీడు: చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. 2018 అక్టోబర్‌లో ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినగడపకు చెందిన కోటగిరి రాహుల్ తన సమీప బంధువు ఏ కొండూరుకు చెందిన బలమూరి నాగపద్మకు రూ.5 లక్షలు అప్పుగా ఇచ్చాడు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించమని రాహుల్ అడుగగా నాగపద్మ 2019 జులైలో రూ.5 లక్షలకు చెక్కు ఇచ్చింది. ఆ చెక్కును రాహుల్ బ్యాంకులో వేయగా ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్కు బౌన్స్ అయ్యింది. దీనిపై రాహుల్ కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం నాగపద్మకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ స్పెషల్ మేజిస్ట్రేట్ తీర్పును వెలువరించారు.

బాలికపై అత్యాచారయత్నం

దెందులూరు: బాలికపై ఓ మైనర్ బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాలివి. మసీదుపాడు గ్రామంలో బాలిక (4)పై అదే గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలుడు తన ఇంట్లో అత్యాచారయత్నం చేశాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై శివాజీ చెప్పారు. నూజివీడు డీఎస్పీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా?

భీమవరం: భీమవరంలోని ఒక వ్యాపారి ఇంట్లో దొంగతనానికి వచ్చిన దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. టూటౌన్ ప్రాంతంలో పెద్దెత్తున వ్యాపారం చేస్తున్న ఒక వ్యక్తిని టార్గెట్‌గా చేసుకుని రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంతాలకు చెందిన సుమారు 12 మంది ముఠా సభ్యులు కార్లలో మారణాయుధాలతో దోపిడి చేయడానికి వచ్చారు. అయితే ఇంటి గోడలు దూకుతుండగా ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కడంతో భీమవరం పట్టణంలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమని సమతాసైనిక్ దళ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం, దళిత బహుజన సీనియర్ నాయకుడు నేతల రమేష్ బాబు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం జరుపుకుంటున్న వేళ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

● మద్దిక్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో కిటకిటలాడిన మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చక్రదేవరపల్లి గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ రూపాల్లో స్వామివారికి రూ.7,30,906 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్వీ చందన తెలిపారు. – జంగారెడ్డిగూడెం రూరల్

● రాజ్యాంగం పట్ల విధేయత

రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేశ పురోగతి, ప్రజల సంక్షేమాలకు తోడ్పాటు నందించే భారత రాజ్యాంగానికి ఆమోదం లభించి 75 వసంతాలు పూర్తిచేసుకుంది. ఈనేపథ్యంలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి అర్పించారు. రాజ్యాంగ పీఠికను పాఠశాలల్లో విద్యార్థులతో చదివించారు. బయ్యనగూడెంలో సరిపల్లి రోడ్‌లో ఉన్న ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులు భారతదేశ చిత్రపటం ఆకారంలో ప్రదర్శన నిర్వహించి రాజ్యాంగం పట్ల తమ విధేయతను చాటుకున్నారు. – కొయ్యలగూడెం



బయ్యనగూడెంలో విద్యార్థుల ప్రదర్శన

● సంక్రాంతి సమరానికి సై



కైకలూరు టౌన్‌హాలులో నెల్లూరుకు చెందిన రైతుల కోడిపుంజుల విక్రయాలు

సంక్రాంతి సమరానికి కోడి పుంజులు సై అంటూ సిద్ధమవుతున్నాయి. ఈనేపథ్యంలోనే పందెపు పుంజుల విక్రయాలు సైతం జోరందుకున్నాయి. పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి సమీప కైకలూరు టౌన్‌హాల్‌లో నెల్లూరు రైతులు వివిధ జాతుల పందెపు కోడి పుంజలను మంగళవారం విక్రయాలకు ఉంచారు. ప్రసార మాధ్యామాల ద్వారా తెలుసుకున్న కోడి పందేల నిర్వాహకులు పెద్ద ఎత్తున వచ్చి నచ్చిన పుంజును కొనుగోలు చేశారు. పలు జాతుల పందెపు కోడిపుంజులు ఒక్కొక్కటి రూ.7 వేల నుంచి రూ.10 వేలు వరకు పలికాయి. – కైకలూరు

పరిమిత సాగు.. సురక్షితం



బుట్టాయగూడెంలో పొగాకు పంటకు సాలు దున్నుతున్న దృశ్యం



బుట్టాయగూడెంలో రైతులు వేసిన పొగాకు నారుమడులు

- గతేడాది రికార్డు ధరలు చూసిన వర్జీనియా పొగాకు
- ఈ ఏడాది అదే అంచనాలతో ఉత్సాహంగా రైతుల సాగు
- గత ధరలు ఉండకపోవచ్చంటున్న బోర్డు అధికారులు
- సాగు విస్తీర్ణం తగ్గించాలని సూచన

బుట్టాయగూడెం: గతేడాదిలో వర్జీనియా పొగాకు రికార్డు ధరల మోత మోగించడంతో ఈ ఏడాది రైతులు ఉత్సాహంగా వర్జీనియా సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం మార్కెట్ సైతం ఆశాజనకంగా ఉండడం, వాతావరణం అనుకూలంగా ఉండడంతో భారీగా సాగుచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. దీనికితోడు ఈ ఏడాది పొగాకు సాగు పరిమితిని పెంచుతూ టుబాకో బోర్డు నిర్ణయం తీసుకోవడంతో ఇక రైతులు తగ్గేదేలే అంటూ సంబరపడిపోతున్నారు. అయితే ఈ సీజన్‌లో మార్కెట్ ఎలా ఉంటుందో, పరిమిత సాగు శ్రేయస్కరమని బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

24,776 హెక్టార్లలో సాగుకు అనుమతి

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో గల జంగారెడ్డిగూడెం–1–2, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురం ఐదు వేలం కేంద్రాల పరిధిలో 2024–25 పంటల కాలానికి పొగాకు బోర్డు సుమారు 24,776 హెక్టార్లలో పొగాకు సాగుకు అనుమతి ఇచ్చింది. బ్యారన్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా అధికారులు ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారు 12,861 పొగాకు బ్యారన్లు రిజిస్టర్ అయ్యాయి. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు 3,500 హెక్టార్ల వరకూ రైతులు పొగాకు పంటలు వేసినట్లు అధికారులు తెలిపారు.

గణనీయంగా పెరగనున్న సాగు

2024–25 సీజన్ పంటల కాలంలో పొగాకు సాగు గణనీయంగా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి ఏటా సాగు చేసే భూములతో పాటు భారీగా కౌలు భూముల్లో సైతం రైతులు సాగు చేస్తున్నారు. 2023–24 సీజన్‌కు సంబంధించి పంటల కాలంలో మార్కెట్‌లో పొగాకుకు ఊహించని విధంగా రికార్డు స్థాయిలో ధర లభించడంతో అత్యధికంగా రైతులు పొగాకు సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. జీడిమామిడి, మామిడి, కొబ్బరి, కోకో తోటలను తొలగించి పొగాకు పంట సాగు చేస్తున్నారు.

భూములకు పెరిగిన కౌలు

గత నాలుగేళ్లుగా పొగాకు పంటకు రికార్డు స్థాయిలో ధర లభించడంతో రైతుల దృష్టి పొగాకు సాగుపై పడింది. పొగాకు సాగుపై రైతులు మొగ్గుచూపడంతో భూముల కౌలు సైతం భారీగా పెరిగాయి. ఎకరం రూ.70 వేలు నుంచి రూ.80 వేల వరకూ పెరిగాయి. అయినా పోటీ పడి మరీ రైతులు కౌలుకు భూములు తీసుకొని సాగు చేస్తున్నారు. 2023 – 24 సీజన్‌కు సంబంధించి పొగాకు బోర్డు 48.5 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 67 మిలియన్ల కిలోలు ఉత్పత్తి చేశారు. 2024–25 సీజన్‌కు సంబంధించి బోర్డు 58.75 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా అదనంగా మరో 20 కిలోలు ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే బోర్డు నిబంధనల మేరకు పంట ఉత్పత్తి చేయకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

పరిమితికి మించి పంట వేయొద్దు



పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతి మేరకే రైతులు పంటలు వేయాలి. అనుమతిని మించి సాగు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. గత ఏడాది జింబాంబ్వే, ఆఫ్రికా, బ్రెజిల్ దేశాల్లో పొగాకు పంట దెబ్బతినడంతో మన ప్రాంతంలో పండించిన పొగాకుకు డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది ఆ పరిస్థితి ఉండకపోవచ్చు. రైతులు పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన పొగాకు పంటను పండించాలి.

– బి.శ్రీహరి, ఆక్షన్ సూపరింటెండెంట్, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం –1

వరి కోతలు వాయిదా వేసుకోండి

రైతులకు సూచించిన జేసీ

ఉండి: అల్పపీడన ప్రభావం కారణంగా వరికోతలు వాయిదా వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టీ రాహుల్‌కుమార్ రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం ఉండి మండలం చిలుకూరులో కళ్లాలపై తూకం వేస్తున్న ధాన్యం రాశులను ఆయన పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా లేని కారణంగా వరికోతలు వాయిదా వేసుకోవడం మంచిదన్నారు. ఇప్పటికే వరి కోతలు కోసిన వారు మాత్రం కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. దళారులను నమ్మి పోసవద్దని, రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. చిలుకూరులో ధాన్యం తూకం వేసే సమయంలో 40.6 కేజీలు ఉండాల్సిన బస్తా 400 గ్రాములు అధికంగా తూకం వేయడంతో రైతులను వివరాలు అడిగారు. చినిగిన గోనె సంచుల వల్ల ఇబ్బందులు ఉంటాయని రైతులు చెప్పడంతో డీసీఎం సొసైటీ అధికారులతో మాట్లాడి గోనె సంచులకు ప్యాచ్ వర్క్స్ చేయించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి సంధ్య, వీఆర్వో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరులో ధాన్యం తూకాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

చింతూరు టు ఖమ్మం వయా కుక్కునూరు

గంజాయి అక్రమ రవాణా సాగిస్తున్న స్మగ్లర్లు

కుక్కునూరు: గంజాయి అక్రమ రవాణా సాగించే స్మగ్లర్లకు కుక్కునూరు రహదారి రాజమార్గంగా తయారైంది. దీంతో చింతూరు, ఒరిస్సా, చత్తీస్ఘడ్ తదితర ప్రాంతాల నుంచి గంజాయిని కుక్కునూరు మీదుగా ఖమ్మం తరలిస్తున్నారు. సోమవారం కుక్కునూరు నుంచి అశ్వారావుపేట మీదుగా 10 కేజీల గంజాయిని ఖమ్మం తరలిస్తుండగా, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలంలో పట్టుకున్నారు. వారిని విచారించగా, బూర్గుంపాడు నుంచి కుక్కునూరు మీదుగా ఖమ్మం తరలిస్తున్నట్లు నిందితులు చెప్పినట్లుగా సమాచారం. గత ప్రభుత్వంలో అంతర్రాష్ట్ర సరిహద్దు గ్రామాల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కాని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెక్‌పోస్టు వద్ద భద్రతను ఏర్పాటు చేయకపోవడంతో దూరమైనా కుక్కునూరు మీదుగా అక్రమార్కులు తరలిస్తున్నారు. దీనికి తోడు ఈ రహదారి వెంబడి ఎటువంటి తనిఖీలు లేకపోవడం కూడా స్మగ్లర్లు ఈ దారిని ఎంచుకోవడానికి కారణమైంది. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై తెలంగాణ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌ను ఫోన్‌లో సంప్రదించగా, నిందితులు గంజాయిని బైక్‌పై కుక్కునూరు మీదుగా తీసుకువచ్చినట్లు చెప్పారని వెల్లడించారు.



గంజాయి తరలిస్తున్న నిందితులతో తెలంగాణ ఎక్సైజ్ పోలీసులు

'ముద్దరబోయిన'ను సస్పెండ్ చేయాలి

నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు

నూజివీడు: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, రావిచర్ల సర్పంచి కాపా శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నూజివీడు మండలం రావిచర్ల, ఆగిరిపల్లి మండలం తాడేపల్లిలో అక్రమ మైనింగ్ చేస్తున్నారంటూ ముద్దరబోయిన మీకోసంలో ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. అధికార పార్టీలో ఉంటూ ఆ పార్టీ నాయకులపై బురదజల్లడం దురదృష్టకరమన్నారు. దీనిపై అధిష్టానం విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరుసార్లు పోటీ చేసిన ముద్దరబోయిన గన్నవరంలో ఒక్కసారి గెలిచారని, అక్కడ అక్రమ మైనింగ్‌కు అలవాటు పడి 2014 వరకు దోచుకున్నాడని చెప్పారు. 'నీకు లంచాలు ఇవ్వకపోతే వారిపై కక్షగట్టి ఆరోపణలు చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు..' అంటూ ముద్దరబోయినను ఉద్దేశించి ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు

ప్రకృతి వ్యవసాయమే పర్యావరణానికి రక్ష

తాడేపల్లిగూడెం: ప్రకృతి వ్యవసాయమే పర్యావరణానికి రక్ష అని వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, సెరీ కల్చర్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. మంగళవారం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతుల ఆదాయం పెంచడమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో క్రియాశీలకంగా ఉంటుందన్నారు. శాస్త్రీయ సంస్థలు, ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. ఉద్యాన వర్సిటీ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ జీరో బడ్జెట్ వ్యవసాయంగా 2016లో ప్రకృతి వ్యవసాయాన్ని గుర్తించారన్నారు. ఇప్పుడు అది ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ బేస్డ్ నేచురల్ ఫార్మింగ్‌గా మారిందన్నారు. భూమిని కాపాడటానికి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయం చేయడం నేచురల్ ఫార్మింగ్ లక్ష్యమన్నారు. ప్రకృతి వ్యవసాయంలో మట్టి నాణ్యత, నీటి వినియోగం, శ్రామిక ఖర్చులు తగ్గుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులు ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధిస్తారని రిటైర్డ్ ఐఏఎస్, ఆర్‌వైఎస్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, పరిశోధన సంచాలకులు కేఎస్.వరప్రసాద్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ విద్యను పాఠ్యాంశాల్లో చేర్చడం వల్ల కలిగిన ప్రయోజనాల గురించి డీపీ రాయుడు (రిటైర్డ్ ఐఏఎస్) వివరించారు. ప్రగతి శీల రైతులను ఈ సందర్భంగా సత్కరించారు. డైరెక్టర్ ఆఫ్ హార్టీకల్చర్ శామ్యూల్ ఆనంద్ కుమార్, ఎం.మాధవి, రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.



ఉద్యాన వర్సిటీలో మొక్క నాటుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

నేషనల్ హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్‌గా నిస్సీఫ్లోరా

ఉండి: నేషనల్ హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉండి పెదపేటకు చెందిన గోడి నిస్సీఫ్లోరా నియమితులయ్యారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో డిసెంబర్ 2న ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 16 డైరెక్టర్ పోస్టులకుగాను 16 వేల మంది ప్రిలిమ్స్ పరీక్ష రాశారు. అందులో 251 మంది మెయిన్స్‌కు ఎంపిక కాగా 65 మంది ఇంటర్వ్యూకు పోటీ పడ్డారు. ఈ పరీక్షల్లో నిస్సీఫ్లోరా ప్రతిభ కనబరిచి డైరెక్టర్ పోస్టుకు అర్హత సంపాదించారు. మంగళవారం ఆమె తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో నేషనల్ హార్టీకల్చర్ బోర్డు 2023 డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇవ్వడంతో 2024 జనవరిలో దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అనంతరం ఫిబ్రవరిలో ప్రిలిమ్స్, మార్చిలో మెయిన్స్ పరీక్షలు రాశానని, ఏప్రిల్‌లో ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందన్నారు. అక్టోబర్‌లో ఫైనల్ రిజల్ట్ వెలువడగా ఈనెల 18వ తేదీన అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చినట్లు ఆమె తెలిపారు.



నిస్సీఫ్లోరా

గల్ఫ్ పంపిస్తానని మోసం.. కేసు నమోదు

భీమవరం: ప్లంబింగ్ పనికి గల్ఫ్ పంపిస్తానని చెప్పి సొమ్ము తీసుకుని మలేషియా పంపించి మోసం చేశారంటూ భీమవరం పట్టణం మోటుపల్లి వారివీధికి చెందిన కోడె నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలివి. నాగరాజు ఉపాధికోసం గల్ఫ్ వెళ్లే ప్రయత్నంలో ఉండగా ప్రకాష్‌నగర్‌కు చెందిన రేవు రామలక్ష్మి ప్లంబింగ్ పనులకు గల్ఫ్ పంపిస్తానని నమ్మించి రూ.1.50 లక్షలు తీసుకుంది. అయితే నాగరాజును మలేషియా పంపించి హోటల్ పనిలో పెట్టడంతో అక్కడ జీతం ఇవ్వకుండా మానసికంగా వేధించారు. దీనితో నాగరాజు భార్య రామలక్ష్మిని కలిసి తన భర్తను తిరిగి రప్పించాలని కోరినా పట్టించుకోలేదు. దీంతో సొంత డబ్బులతో తిరిగి వచ్చిన నాగరాజు రామలక్ష్మిని నిలదీయగా నీ అంతుచూస్తానని బెదిరించారు. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ చెప్పారు.

ఎక్సైజ్ దాడులు



నామవరంలో సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

చింతలపూడి: ఎక్సైజ్ అధికారులు మంగళవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. చింతలపూడి మండలం నామవరం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించి 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే విధంగా టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామంలో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, భూక్యా రాంబాబు అనే వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరరావు, ఎస్సై రాజేంద్ర, స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, ఏలూరు, చింతలపూడి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం మాది.. పెత్తనం మాది

- సత్తాల చెరువులో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు
- ఇదేంటని ప్రశ్నిస్తున్న వారిపై టీడీపీ నేత దౌర్జన్యాలు

ద్వారకాతిరుమల: ప్రభుత్వం మాది.. పెత్తనం మాది.. ఎవడ్రా మమ్మల్ని ఆపేది అంటూ ఒక టీడీపీ నేత చెరువు మట్టిని కొల్లగొట్టేస్తున్నాడు. యథేచ్ఛగా మట్టిని విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నాడు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దౌర్జన్యానికి తెగబడుతున్నాడు. వివరాల్లోకి వెళితే. మండలంలోని సత్తాల గ్రామంలోని పెద్ద చెరువులో ఒక టీడీపీ నాయకుడు గత కొద్దిరోజులుగా జేసీబీ సహాయంతో అక్రమ మట్టి తవ్వకాలను జరుపుతున్నాడు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా టిప్పర్ల ద్వారా మట్టిని తరలించేస్తున్నాడు. నిత్యం 50కు పైగా టిప్పర్ల మట్టి కొల్లేరు ప్రాంతానికి తరలిపోతోంది. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. అక్రమ మట్టి తరలింపుపై ఎవరైనా ప్రశ్నిస్తే ఆ నేత దౌర్జన్యానికి పాల్పడుతున్నాడట. స్థానికులపైనే కాదు.. మట్టి రవాణా కారణంగా తమ రోడ్లు పాడవుతున్నాయని అడుగుతున్న కైకరం, కొండ్రుపాడు గ్రామాలకు చెందిన వారిపైనా ఆ నేత రుబాబు చేస్తున్నాడట. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పచ్చ నేతల మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సతీష్ వివరణ ఇస్తూ సత్తాల చెరువులో అనధికారికంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను సోమవారం రాత్రి తాను నిలుపుదల చేసినట్టు చెప్పారు.



ద్వారకాతిరుమల మండలం సత్తాల చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు